దనము చిలుకరించినాడు. కావుననే సంగీత మెలనాగల స్వత్వమై యొప్పుచున్నది.

సంగీతమే యననేల? జాతీయములతో నొప్పు చక్కని సంభాషణా చాతుర్యము స్త్రీలకు వెన్నతోడ బెట్టినవిద్య. ఈ రెండు గుణములు వారి వేడుకపాటలయందు ప్రతిబింబించుచున్నవి. ఈనాడు అన్యభాషా కలుషితమై ఆంధ్రభాష పురుషుల వాగ్రూపమున వికారముగా ప్రత్యక్షమగుచున్నది. అద్దానినిక్కంపు సొగసు యింకను మన చెలియల పలుకులయందే నెలకొనియున్నది. భామామణులు భావాల భరిణెలు; వారి హృదయములు రసార్ద్రములు. ఈ రసార్ద్రితవారి వేడుకపాటలయందు ప్రతిబింబించుచున్నది.

సంఘముయొక్క వివిధ సమస్యల కాలయాలములగు స్త్రీల పాటలు మన సాంసారిక సౌందర్యమునకు ప్రతిబింబములు. కళాస్వరూపములగు కసుగందుల నిదురవుచ్చుటకై యుయ్యెల నూచునప్పుడు, తోడి నెచ్చెలులతోడ పూదోటయందు మెలగునప్పుడు, వివాహాది శుభకార్యములందు వరుసగల వనితలతో లే బరియాచకములనాడు నవసరమున, మంగళగౌరి, శ్రావణ శుక్రవారము మున్నగు నోములు నోచునప్పుడును మగువల మనసులు భావార్ద్రములగుట సహజము. తత్ఫలితమే వారి గేయ సముదాయము.

## జోలపాటలు : లాలిపాటలు

జోలపాటలు, లాలిపాటలు ముఖ్యముగా శబ్దచిత్ర ప్రధానములు. లలిత సంస్కృత పద బహుళములు. చూడుడు:—

1. "జో రవికుల శుభాంగ, జో సన్నుతాంగ"
2. "లాలి బంగరుబొమ్మ లాలి మా యమ్మ
   లాలి ముద్దులగుమ్మ లాలి సీతమ్మ".

"పగడంపు రతనాల పసిడితొట్టెగట్టి,
సొగసైన పైడి గొలుసుల చేతబట్టి

# నవ్యసాహిత్యమున వీరకావ్యములు

"ఆంధ్రసారస్వత పరిషత్తు ఓరుగల్లు వార్షికోత్సవ సందర్భమున చదివిన వ్యాసము."

కవిత్వమనగా జీవిత విమర్శనమని యొక సుప్రసిద్ధ ఆంగ్ల విమర్శక శేఖరుడు వచించినాడు. సాహిత్యము సమకాలిక సంఘ జీవితమునకు ప్రతిబింబమని మరియొక యభిప్రాయము. నాకు జూడగా నీ రెండు సూత్రములును పరస్పరవిరుద్ధములు గాకుండుటయే కాక యన్యోన్య సహాకార మొనరించుకొనుచున్నవి. ఏలయన కవితకు ఉద్రేకము ప్రోత్సాహజనకమైనపుడు కవికి సమకాలిక మానవజీవిత విమర్శనముకన్న యెక్కుడు భావస్ఫోరకమగువస్తువు కానరాదు. మానవ జీవిత విమర్శనమునందు నిమగ్నుడగు లేఖినికి సమకాలిక సంఘమే యాశ్రయమగుట మిక్కిలి సహజము. పారలౌకికములును, అనుభవదూరములును అగు విషయములను గురించి భావోదయమై హృదయము రసార్ద్రమగుట అసంభవము కాకపోయినను అసామాన్యమును, అసాధారణము అని నా విధేయవిజ్ఞప్తి. మానవ జీవితమే సాహితీ సర్వస్వమని సిద్ధాంతముచేయు నధికారముకాని అభిలాషకాని నాకులేదు, కాని సాహిత్యమునకు, కవిత్వమునకు అత్యావసరమగు ముఖ్యలక్షణములలో నొక్కటి మానవ జీవిత విమర్శనమను సర్వజనాంగీకారమగు విషయమును మాత్రమిచట మనవిచేయుట నా విధ్యుక్తధర్మము. మానవజీవితమునకు సంబంధించని ప్రకృతి సౌందర్యవర్ణనాదులు కవితాప్రపంచమున సమున్నతస్థానము నలంకరింపక పోలేదు. ఋతుసంహారమువంటి కావ్యము లిందుకు నిదర్శనము. ఋతుసంహారమునందును సమకాలిక విలాసజీవన చిత్రణముకలదు. సమకాలిక సంఘజీవితముతో నెట్టి సంబంధమునులేని యితివృత్తములు కథావస్తువులుగాగల కావ్యములు లేకపోలేదు. సుప్రసిద్ధములగు

శాంతరసము స్థాయి. ప్రతాప చరిత్రమున ప్రతి పదమునందున వీరరస ముట్టిపడుచుండును.

ఈ రెండు కావ్యములకుగల వైలక్షణ్యమునకు కారణము తత్కథానాయకుల విశిష్టతయే. ప్రతాపుడు ఆదర్శము నే ప్రధానముగా నెంచుకొని అందుకొరకు సర్వమును త్యాగమొనరింప సంసిద్ధుడు. పవిత్రమగు నాదర్శమును పవిత్రమగు సాధన సహాయమున పొందగోరు వాడు ప్రతాపుడు. వెనుకముందాలోచించుట యీతని ప్రకృతికి విరుద్ధము. కాని కార్యార్థియై, లక్ష్యసిద్ధికై సాధనశుద్ధి నంతగా సరకు సేయనివాడు శివుడు. ఈ విభేదమే రాజపుత్ర మహారాష్ట్ర ప్రకృతు లందు గల విభేదము; ఈ కావ్యద్వయ విశిష్టత.

ఈ రెండు గ్రంథములందలి యితివృత్తములును ఆంధ్ర దేశము నకు సంబంధించనివి. ఆంధ్రచరిత్ర వీరగాథల కాలవాలము. ఆంధ్రు లనేక సామ్రాజ్యముల నిర్మించిరి. వారి వైభవము ప్లినీవంటి చరిత్ర కారునకు కన్నులు కుట్టినది; మార్కోపోలోవంటి యాత్రికుని దిగ్భ్రాంతు నొనరించినది. వారికి ప్రత్యేక సంస్కృతి గలదు; ప్రకాశవంతమగు సాహిత్యము కలదు; ఉజ్జ్వలమగు చరిత్రగలదు. ఎన్ని రాజ్యములు, ఎన్ని సామ్రాజ్యములు, ఎన్ని యుద్ధములు, ఎంత రాజనీతి వైశారద్యము ఆంధ్రచరిత్రమున గోచరించునో ఒకమారు పుటలను తెరచిచూడుడు. రక్తాంకితములగు నక్షరములను తిలకింపుడు. ఎంతమంది యాంధ్ర కవులు లీ గాథలను గాన మొనరించినారు? ఎందర భావనాశక్తికీ చరిత్ర దోహద మొసంగినది?

ఆధునిక కవి కుమారులు మన సారస్వతమున నూతన మార్గముల ననేకములను ద్రొక్కుచున్నారు. అతివాస్తవికత, అభ్యుదయరచన వీనిలో ముఖ్యములు. మార్పుఅనిన యులికిపడువారిలో నేనొక్కడను కాను. సారస్వత రంగమున నవ్యత యనివార్యము; అట్టి నవ్యతకు సుస్వాగత మొసంగుట మన పరమధర్మము. కాని సాంప్రదాయ విరుద్ధములగు వెఱ్ఱి వేషములను వేయుటవలన యెట్టి ప్రయోజనమును లేదు. ప్రాతదియెల్లను బోతయని దాని కగ్ని సంస్కార మొనరింప

